జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

సోమవారం | 8-9-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 448 పేజీలు: 4 వెల : రూ.7


# కొత్తూరు సీహెచ్‌సీలో.. విద్యుత్ పునరుద్ధరణ

* అధికారులను కదిలించిన 'జాతీయ వార్త' కథనం
* ఆసుపత్రిలో దగ్గరుండి మరీ పనులు చేయించిన డీసీహెచ్

**కొత్తూరు, సెప్టెంబర్ 7 (వార్త):** కొత్తూరు సీహెచ్‌సీలో ఎట్టకేలకు విద్యుత్ పునరుద్ధరణ పనులను సంబంధిత అధికారులు చేపట్టారు. 'జాతీయ వార్త'లో ఈనెల 6న చీకట్లో కొత్తూరు పీహెచ్‌సీ' అన్న కథనానికి వైద్య ఆరోగ్యశాఖాధికారులు స్పందించారు. శ్రీకాకుళం డీసీహెచ్ కళ్యాణ్‌బాబు శనివారం కొత్తూరు సీహెచ్‌సీని సందర్శించారు. వైద్యాధికారులు, సిబ్బంది, రోగులతో మాట్లాడి విద్యుత్ సమస్యపై అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ శాఖ అధికారులతో డీసీహెచ్ మాట్లాడి విద్యుత్ పునరుద్ధరణ పనులు పూర్తిస్థాయిలో చేయించారు. ఎట్టకేలకు విద్యుత్ కష్టాలు తీరడంతో రోగులతో పాటు వైద్యసిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు.





చీకట్లో..

* ఇబ్బందులు పడుతున్న రోగులు, వైద్యులు, సిబ్బంది * వైద్యానికి సరిపడా వైద్యులు ఉన్న.. సదుపాయాలు మాత్రం సున్నా * రోగుల గోడును పట్టించుకోని పాలకులు * గతంలో కథనాలు వచ్చినా కన్నెత్తి చూడని ఆసుపత్రి సలహా కమిటీ * పరిశీలనలు, తనిఖీలకే పరిమితమవుతున్న ఎమ్మెల్యే మామిడి * ఎమ్మెల్యే గారు.. మా మొర వినాలంటున్న మండలవాసులు

కొత్తూరు పీహెచ్‌సీ

కొత్తూరు, సెప్టెంబర్ 5 (వార్త): కొత్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స కోసం వచ్చే రోగులు చీకటి కష్టాలు తప్పడం లేదు. గత రెండు రోజులుగా గర్భిణిలు చిన్నపిల్లల వార్డుల్లో కరెంటు సరఫరా లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రత్యేకించి జ్వరాల సీజన్ కావడంతో ప్రతిరోజు 250 నుంచి 300 మంది వరకు ఇక్కడ నమోదవుతోంది. ఆసుపత్రిలో అవసరమైన ప్రాథమిక సదుపాయాలు కూడా లేకపోవడంపై రోగులతో పాటు వారి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైద్యులు పూర్తిస్థాయిలో ఉన్నప్పటికీ మౌలిక సదుపాయాలు లేకపోవడంతో వారు సైతం చేతులెత్తేస్తున్నారు. కరెంటు పోతే చాలు రోగుల నరకయాతన పడుతున్నారు. ఇప్పటికే ఈ సమస్యను ఆసుపత్రి చైర్మన్‌గా ఉన్న స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దృష్టికి స్థానికులు పలుమార్లు తీసుకువెళ్లారు. పత్రికల్లోనూ కథనాలు వచ్చాయి. ఆసుపత్రి చైర్మన్‌గా ఉన్న ఎమ్మెల్యే సైతం పలుమార్లు ఇక్కడకు వచ్చి సమస్యలు తెలుసుకున్నారు. తన వ్యక్తిగత నిధుల నుంచైనా కరెంటు సమస్యకు పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చేశారు. మామిడి గోవిందరావు ఎమ్మెల్యే కాకముందు ఏదైనా హామీ ఇస్తే చేసి తీరుతారు.. అన్న నమ్మకం ప్రజల్లో ఉండేది. అయితే ఆయన ఎమ్మెల్యే అయిన తర్వాత మారిపోయారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇకనైనా ఆసుపత్రి పాలకవర్గం స్పందించి కొత్తూరు పీహెచ్‌సీలో విద్యుత్ సమస్యకు ఫుల్‌స్టాప్ పెట్టేలా చూడాలని పలువురు కోరుతున్నారు. ఏం చేస్తారో మరి వేచి చూడాల్సిందే.

# ఆలయాలు మూసివేత

**శ్రీకాకుళం/జలుమూరు, సెప్టెంబర్ 7 (వార్త):** సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా జిల్లాలోని పలు ఆలయాలను ఆదివారం మధ్యాహ్నం మూసివేశారు. అరసవల్లి సూర్య నారాయణస్వామి, శ్రీకూర్మం కూర్మనాథ స్వామి ఆలయం, శ్రీకాకుళం ఉమారుద్ర కోటేశ్వర ఆలయం, శ్రీముఖలింగంలోని ముఖలింగేశ్వర స్వామి ఆలయంతో పాటు పలు ఆలయాల్లో ఆదివారం నిత్యార్చనలు, నివేదన తర్వాత మధ్యాహ్నం రెండు గంటలు తర్వాత మూసివేశారు. గ్రహణానంతరం సంప్రోక్షణ, శుద్ధి కార్యక్రమాలు అయిన తర్వాత సోమవారం ఉదయం ఎనిమిది గంటల తర్వాత ఆలయాలు తెరువనున్నారు. ఆలయాల్లో పూజలు అనంతరం భక్తులకు అనుమతిస్తామని ఆలయ అర్చకులు, అధికారులు తెలిపారు.





## రైతు సమస్యలపై నేడు డయల్ యువర్ కలెక్టర్

**శ్రీకాకుళం, సెప్టెంబర్ 7 (వార్త):** ఎరువులు, రైతుల సమస్యలను తెలుసుకోవడంతో పాటు, సూచనలు, సలహాలు స్వీకరించేందుకు సోమవారం ఉదయం తొమ్మిది నుంచి పది గంటల మధ్యలో డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. రైతులు 08942-222565 నంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలు తెలియజేయవచ్చన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించడంలో ఈ కార్యక్రమం సహాయపడుతుందని కలెక్టర్ తెలిపారు.

# రైతులకు బాసటగా వైసీపీ పోరుబాట

* అన్నదాతల సమస్యలు పట్టించుకోని కూటమి ప్రభుత్వం * ఎరువులు బ్లాక్ చేస్తున్న కూటమి నేతలు * వారి సమస్యలపై 9న పోరుబాట
* మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్సీ నర్తు రామారావు



**సోంపేట/పలాస, సెప్టెంబర్7 (వార్త):** రాష్ట్రంలో అధికారంలోనున్న కూటమి ప్రభుత్వం రైతాంగానికి ఇబ్బంది పెడుతూ వారి పట్ల అవలంబిస్తున్న తీరును నిరసిస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు ఈనెల9న అన్నదాత పోరుబాట కార్యక్రమం నిర్వహిస్తున్నామని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. ఆదివారం సోంపేటలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఇచ్చాపురం నియోజకవర్గ సమన్వయకర్త, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పిరియా విజయ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పాల్గొని పోరుబాట పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువుల పంపిణీలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు మాట్లాడుతూ ఎరువులను కూటమి నేతలు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని విమర్శించారు. ఎరువులు పక్కదోవ పట్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఉచిత పంటలు బీమాను పునరుద్ధరించి అందరికీ వర్తింపజేయాలని కోరారు. ఈనెల 9న కాశీబుగ్గలోని వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం నుండి పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అనంతరం పలాస ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం సమర్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇచ్చాపురం వైసిపి ముఖ్య నాయకులు పైల దేవదాస్ రెడ్డి, ఇప్పిలి కృష్ణారావు, తడక జోగారావు, నర్తు నరేంద్ర యాదవ్, సాడి శ్యాంప్రసాద్ రెడ్డి, బోర పుష్ప, ఉలాల భారతి దివ్య, కడియాల ప్రకాష్, జిల్లా, నియోజకవర్గ, మండల అనుబంధ విభాగాల సభ్యులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## ఆదిత్యుని సన్నిధిలో మంత్రి రవీంద్ర

**అరసవల్లి, సెప్టెంబర్7 (వార్త):** అరసవల్లి సూర్యనారాయణ స్వామి ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గనులు భూగర్భ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర దంపతులు ఆదివారం దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఆలయ కార్యనిర్వహణాధికారి ప్రసాద్ ఘన స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఆలయ అధికారులు స్వామి వారి ప్రసాదం, చిత్రపటం అందజేశారు. మంత్రి వెంట ఎమ్మెల్యే గొండు శంకర్ ఉన్నారు.



# రైతులను ఆదుకుంటాం.. ఆందోళన వద్దు

*** వారంలో 3వేల మెట్రిక్ టన్నుల యూరియా దిగుమతి * కేంద్ర ఫెర్టిలైజర్ మంత్రిత్వ శాఖతో సంప్రదింపులు * కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు * కలెక్టర్‌తో సమీక్ష**

**శ్రీకాకుళం, సెప్టెంబర్7(వార్త):** జిల్లాలో యూరియా పంపిణీపై కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆదివారం కలెక్టర్ పుండ్కర్‌తో చరవాణీలో సమీక్షించారు. ఇప్పటి వరకు జిల్లాకు వచ్చిన యూరియా, పంపిణీలో ఎదురవుతున్న సమస్య లను కేంద్రమంత్రికి కలెక్టర్ వివరించారు. ఈ నేప ధ్యంలో జిల్లాలో యూరియా సరఫరాపై పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను రామ్మోహన్ నాయుడు ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు ఎప్పటికప్పుడు సరి చేసుకోవాలని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూచనల మేరకు రైతు లు, రైతు సేవ కేంద్రాలను సమన్వయ పరిచి పటి ష్టంగా పంపిణీ జరగాలని కోరారు. మరో వారం రోజుల్లో మరో విడతగా జిల్లాకు మూడువేల మెట్రిక్ టన్నుల యూరియా రానున్నట్టు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్.. కేంద్ర మంత్రికి వివరించారు. ఈ నేపథ్యంలో చిన్న, సన్నకారు రైతులకు పూర్తి స్థాయి సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని రామ్మోహన్ నాయుడు అన్నారు. యూరియా వాడకంలో కూడా తగినంత పరిమితి, జాగ్రత్తలు తీసుకునేవిధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తాను ఇప్పటికే రాష్ట్రంలో యూరియా పరిస్థితుల దృష్ట్యా కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖతో సంప్రదింపులు జరిపానని, కేంద్రం కూడా డిమాండుకు తగ్గ సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. రైతులు ఎవరు కూడా ఆందోళన చెందవలసిన అవసరం లేదని, రైతు సేవా కేంద్రాలలోనే తగినంత యూరియా, ఇతర ఎరువులు లభిస్తాయని రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు.



# అందుబాటులో 1600 మెట్రిక్ టన్నుల యూరియా

*** మరో వారం రోజుల్లో 3 వేల మెట్రిక్ టన్నుల యూరియా రాక * యూరియా కోసం రైతులు ఆందోళన చెందవద్దు * జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడి**

**శ్రీకాకుళం, సెప్టెంబర్7 (వార్త):** జిల్లాలో ప్రస్తుతం 1600 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం వెల్లడించారు. మరో వారం రోజుల్లో 3 వేల మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు రానున్నట్లు ఆయన పేర్కొన్నారు. తదుపరి విడత ఎరువులు వచ్చే అంచనా తేదీని గ్రామ వ్యవసాయ సహాయకులు, మండల వ్యవసాయ అధికారులు రైతులకు తెలియజేయనున్నట్లు పేర్కొన్నారు. రైతులు ఆందోళన చేందాల్సిన అవసరం లేదన్నారు. ప్రతి ఒక ఎకరా భూమికి యూరియా 3 మోతాదులుగా వినియోగించాలన్నారు. ఒక్కో మోతాదుకు 25 కిలోల చొప్పున యూరియా సరఫరా చేయడబడుతోందని తెలిపారు. యూరియా మూడు విడతలుగా సరఫరా జరుగుతుందని వివరించారు. శాస్త్రీయంగా వినియోగించుట వలన జిల్లాలో ఎటువంటి తెగుళ్ల దాడి ఉండదన్నారు. రైతు సేవా కేంద్రాలు, పిఏసిఎస్, ప్రైవేట్ డీలర్ల ద్వారా యూరియా పంపిణీ జరుగుతుందన్నారు. రైతులకు ఈ సంస్థల ద్వారా ఎరువులు చేరేలా చేయడం జిల్లా యంత్రాంగం బాధ్యతన్నారు. జిల్లాలో యూరియా కొరత లేదని, తగినంత మోతాదులో వినియోగించేందుకు యూరియా అందుబాటులో ఉందని పేర్కొన్నారు. ఏవైనా ఫిర్యాదులు ఉంటే ప్రజలు 9121863788 నెంబర్‌ను సంప్రదించవచ్చు.





### పలు గ్రామాల్లో 'రైతులకు చేరువుగా అధికార యంత్రాంగం'

ఎరువులపై రైతులు ఎలాంటి ఆందోళనలు చెందవద్దని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ రైతులకు భరోసా కల్పించారు. ఆదివారం నిర్వహించిన రైతులకు చేరువుగా అధికార యంత్రాంగం కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం మండలం ఒప్పంగి గ్రామం, టెక్కలి నియోజకవర్గం సంతబొమ్మాళి మండలం లక్ష్మీపురం గ్రామం, కోటబొమ్మాళి మండలం తిలారు గ్రామాల్లో పర్యటించి ఆయన రైతులకు ఎరువులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, వ్యవసాయ శాఖ జెడి త్రినాధ స్వామి, తహసిల్దార్లు, , మండల వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# బాలికల ఆరోగ్యమే సమాజ భవిష్యత్తుకు పునాది

*** కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

**శ్రీకాకుళం, సెప్టెంబర్ 7 (వార్త):** బాలికల ఆరోగ్యమే సమాజ భవిష్యత్తుకు పునాది అని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. చిన్న వయసులోనే వారికి సరైన పరీక్షలు, అవగాహన కల్పిస్తే రేపటి తరాలు ఆరోగ్యవంతమవుతారని తెలి పారు. శ్రీకాకుళం నగరంలోని బాలికల హాస్టల్‌లో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరంలో కలెక్టర్ పాల్గొన్నారు. శ్రీకాకుళం ప్రసూతి, గైనకాలజిస్టుల సంఘం, ఫ్రీమాసన్స్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా చేపట్టిన పి-4 కార్యక్ర మంలో భాగంగా ఈ శిబిరాన్ని ఏర్పా టు చేశారు. ఈ సందర్భంగా కలె క్టర్‌తో పాటు స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ ముఖ్య అతిథులుగా హాజర య్యారు. శిబిరంలో 98 మంది బాలి కలకు అనీమియా స్క్రీనింగ్, రక్తగ్రూప్ పరీక్షలు, గైనకాలజి వైద్యపరీక్షలు, బాడీ మాస్ ఇండెక్స్ రికార్డింగ్ నిర్వహించారు. అదనంగా వ్యక్తిగత శుభ్రత, పీరియడ్స్ సమయంలో శుభ్రతపై నిపుణులు విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అనంతరం హాస్టల్ బాలికలకు ఉచిత సానిటరీ న్యాప్కిన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ, ప్రభుత్వంతో పాటు వైద్యులు, స్వచ్ఛంద సంస్థలు కలిసికట్టుగా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ పీ4 కార్యక్రమం ద్వారా వచ్చే ఆరు నెలల్లో జిల్లాలోని 75 రెసిడెన్షియల్ హాస్టళ్లలో 12వేల మంది బాలికలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించను న్నామని, ఈ క్రమంలో 130 మంది గైనకాలజిస్టులు సేవలు అందిస్తారని నిర్వాహకులు తెలిపారు. డీఎంహెచ్ఓ అనిత, డిసిహెచ్ఎస్ కళ్యాణ్ చక్రవర్తి, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఇన్‌ఛార్జ్ సూపరిం టెండెంట్, సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్, గైనిక్ విభాగ వైద్యుల సంఘం ప్రతినిధులు డాక్టర్ అరవింద్, డాక్టర్ పార్వతీ, డాక్టర్ హారిక తది తరులు పాల్గొన్నారు. అనంతరం ఎస్సీ వసతి గృహం ఆవరణలో కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు మొక్కలు నాటారు.






## యూరియా కొరత లేకుండా చూడండి

**జి.సిగడాం, సెప్టెంబరు7 (వార్త):**యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని శ్రీకాకుళం ఆర్డీవో సాయి ప్రత్యూష అన్నారు. ఆదివారం పెంట గ్రామాన్ని సందర్శించి గ్రామ రైతులతో మాట్లాడారు. రైతు సేవా కేంద్రం పరిధిలో గల రైతులకు ఏమేరకు యూరియా అవసరమో గుర్తించి, రైతులకు ఇబ్బందిలేకుండా అందేలా చూస్తామని తెలిపారు. వరి పంట పొట్ట దశకు వస్తున్నందున రైతులకు యూరియా అవసరమని, ప్రైవేటు ఎరువుల దుఖా నాలలో కూడా యూరియా దొరకకపోవటంతో చాలా ఇబ్బందులు పడుతున్నా మని పలువురు రైతులు వాపోయారు. రెండు, మూడు రోజులలో యూరియా కొరత లేకుండా పూర్తి స్థాయిలో చర్యలు చేపడతామని తెలిపారు. ప్రస్తుతం ఆర్ ఎస్కేలో ఉన్న యూరియా కోసం ఎటువంటి గొడవలు లేకుండా తహసీల్దార్, పోలీసుల సమక్షంలో పంపిణీ చేయాలన్నారు. ఈమె వెంట మండల ప్రత్యే కాధికారి చంద్రజీవన్, తహసీల్దార్ ఎం.సరిత, ఎంపీడీవో జి.రామకృష్ణ, ఏవో బెండు బాజ్జీ, వీఏఏ తలచింతల కుసుమ, వీఆర్వోలు భూపతి నర్సింగరావు, సీతయ్య, నీలకంఠం, వీఆర్ఏ బాలకృష్ణ, సంతోష్ సర్పంచ్ ప్రతినిధి పున్నాన అక్కలనాయుడు, గ్రామ పెద్దలు మక్క నారాయణరావు, మీసాల లక్ష్మణరావు, సింహాద్రి, విజయశంకర్, రైతులు ఉన్నారు.

## నానో యూరియా వాడకాన్ని పెంచాలి



**జి.సిగడాం, సెప్టెంబరు7(వార్త):** రైతులు నానో యూరియా వాడకాన్ని పెంచాలని తహాసీల్దార్ ఎం.సరిత , మండల వ్యవసాయ అధికారి బాబ్జి సూచిం చారు. జి.సిగడాం, బాతువ గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలను ఆదివారం తనిఖీ చేశారు. అలాగే గెడ్డకంచరాం, జి.సిగడాం, పెంట, చెట్టు పొదిలాం, జాడ, జగన్నాధవలస తదితర గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలను మండల ప్రత్యేక అధికారి చంద్ర జీవన్,ఎంపీడీఓ జి.రామకృష్ణ సందర్శించారు. రైతు లకు యూరియా, నానో యూరియాపై అవగాహన కల్పించారు. ఈ సంద ర్భం గా అధికారులు మాట్లాడుతూ రైతులకు యూరియా కొరత లేకుండా చూస్తా మని చెప్పారు. ఎక్కువగా నానో యూరియా వాడకాన్ని రైతులు పెంచా లని దీంతో భూములు సారవంతంగా మారుతాయని అన్నారు. మొదటి దఫాలో యూరియా వేసి రెండో దపాలో నానో యూరియాను మొక్కల మీద పిచికారి చేసినట్లయితే ఆకులు రసాన్ని పీల్చుకొని మొక్కకు బలాన్ని ఇస్తాయన్నారు. సొసైటీల్లో, రైతు సేవా కేంద్రాలలో, ప్రవేటు దుకాణాల్లో యూరియా సక్రమంగా పంపిణీ కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

## సొండిపూడిలో ఎరువుల పంపిణీ తనిఖీ

**మందస, సెప్టెంబరు 7(వార్త):** సొండిపూడి పంచాయతీకి సంబంధిం చిన ఎరువుల పంపిణీ కార్యక్రమాన్ని మందస ఎంపీడీఓ వై.వెంకటరమణ తనిఖీ చేశారు. సొండిపూడి రైతు సేవా కేంద్రంలో వీఏఏ రేవతి ఆధ్వర్యంలో ఎరువుల పంపిణీ జరుగుతుండగా, ఎంపీడీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల అంది స్తున్న తీరు, స్టాక్ రిజిస్టర్, ఏ మేరకు ఎరువులు అవసరం తదితర అంశాలను పరిశీలించారు. రైతులకు ఎరువులు సక్రమంగా అందివ్వాలని సూచించారు. ఈ సందర్భంగా వీఏఏ రేవతి మాట్లాడుతూ సొండిపూడి రైతు సేవా కేంద్రంలో రైతు లకు యూరియా సరఫరా చేయడం జరుగుతోందన్నారు. 850 ఎకరాలు రైతు లు సాగు చేస్తుండగా, ఇప్పటి వరకు 444బస్తాలను 352 మంది రైతులకు పం పిణీ చేశారు. మిగిలిన రైతులకు రానున్న స్టాక్ యూరియా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వీఏఏ రేవతి, వ్యవసాయశాఖ విస్తరణాధికారి పుస్యా ఉదయ్ కుమార్, చింతాడ లక్ష్మీనారాయణ, ఔగాన ఈశ్వరరావు, అల్లుమల నారాయణ రావు, కోనారి సింహాద్రి, మిస్క గణపతి, బుసకల మురళీ, మద్ది మధుబాబు, తలగాన మహేశ్ పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## యూరియా పంపిణీపై ఆర్డీవో విచారణ

**జలుమూరు, సెప్టెంబరు7 (వార్త):** గొటివాడ గ్రామంలో ఎరువులు పంపిణీపై జిల్లా అధికారులకు ఫిర్యాదు అందింది. దీనిపై ఆర్డీవో కె.సాయి ప్రత్యూష శనివారం గ్రామంలో రికార్డులు ప్రాప్తికి విచారణ నిర్వహించారు. అక్ర మాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. యూరియా స్టాక్ పంపిణీ రికార్డులను, నిశితంగా పరిశీలించారు. ఆమెతోపాటు తాసిల్దార్ జన్ని రామారావు, ఆర్ఐ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.






## విద్యార్థులకు మెమోరియల్ స్కాలర్‌షిప్‌లు

**శ్రీకాకుళం, సెప్టెంబర్ 7 (వార్త):** తల్లిదండ్రుల ఆశయాలను సజీవంగా ఉంచడం గొప్పతనమని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఆదివారం నగరంలోని మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో స్వర్గీయ బెవర ముకుందరావు-జయలక్ష్మి, కొరికాన ఆనంత గోవిందరావు మెమోరియల్ స్కాలర్‌షిప్‌లు, విద్యాసామగ్రిని పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో శాసపు జోగి నాయుడు, వాకర్స్ మాజీ గవర్నర్ గేదెల ఇందిరా ప్రసాద్, స్టార్ వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు గేదెల లక్ష్మీ, బెవర వెంకట రవిశంకర్, నల్లాన ప్రభాకరరావు, కొరగంజి గోవిందరావు, వేపారి శ్రీనివాసరావు, ఉట్టి శరత్, తల్లిదండ్రులు పాల్గొ న్నారు. అనంతరం, నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తున్న బెవర రవిశంకర్ కుటుంబ సభ్యులను కలెక్టర్, ఎమ్మెల్యే సత్కరించి వారి సేవలను కొనియాడారు.

## పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



**మందస, సెప్టెంబరు 7(వార్త):** విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని, ఆదిత్య జూనియర్, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ మార్పు హరికృష్ణ ప్రసాద్, బొంగి ప్రవీణ్ కోరారు. బాలిగాం వద్ద గల ఆదిత్య జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ఫ్రెషర్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్స్ మాట్లాడుతూ జూనియర్ విద్యార్థులు సీనియర్లను ఆదర్శంగా తీసుకొని భవిష్యత్తులో మంచిస్థాయిలో ఉండాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం కొత్తగా మార్పు చేస్తున్నటువంటి క్వాంటం టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ కోర్సులపై అవగాహన పెంచుకుని, తక్కువ వయసులోనే ఎక్కువ ఉపాధి అవకాశాలు అత్యధిక వేతనంతో ఉండే స్థాయికి వెళ్తారన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. అలాగే ఇటీవల డీఎస్సీ ఫలితాల్లో కళాశాల విద్యార్థులు పూజారి శిరీష, మద్దెల నవీన్, కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకురాలు పులరి శారదలను సత్కరించారు. కళాశాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి పోటీలకు జ్ఞాన భారతి విద్యార్థి



**ఇచ్ఛాపురం, సెప్టెంబర్ 7 (వార్త):** సీబీఎస్ఈ జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు జ్ఞాన భారతి పాఠశాల విద్యార్థి అఖిల్‌యాదవ్ ఆదివారం తరలి వెళ్లాడు. ఇటీవలే సీబీఎస్ఈ క్లస్టర్ ఏడు పోటీలలో జావెలిన్ త్రో క్రీడాంశంలో జ్ఞాన భారతి పాఠశాలలో 11వ తరగతి చదువుతున్న విద్యార్థి వి.అఖిల్ యాదవ్ 2 స్థానాన్ని సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 10వ తేదీ నుండి 13వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్ వారణాసిలో జాతీయ స్థాయి పోటీలు జరగనున్నాయి. సంత్ అతులానంద్ కాన్వెంట్ స్కూల్ ఈ పోటీలకు ఆతిథ్యం ఇస్తోంది. ఈ పోటీలలో పాల్గొనడానికి విద్యార్థి అఖిల్ యాదవ్ ఆదివారం వ్యాయామ ఉపాధ్యాయుడు రామచంద్రరెడ్డితో కలిసి బయలుదేరి వెళ్లాడు. ఈ సందర్భంగా పాఠశాల కార్యదర్శి, ముఖ్య కార్యనిర్వహణాధికారి జోహార్ ఖాన్ విద్యార్థికి శుభాకాంక్షలు తెలియజేశారు. పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఐబి పండా, ప్రధానోపాధ్యాయురాలు రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్ కుమార్, పరిపాలన అధికారిని సయ్యదా సుల్తానా, ట్రాన్స్పోర్ట్ మేనేజర్ అలీమ్ ఖాన్ పాల్గొన్నారు.

## స్త్రీ శక్తి విజయవంతం చేయాలి

**సరుబుజ్జిలి, సెప్టెంబర్7 (వార్త):** ఆమదాలవలస జూనియర్ కళాశాల ఆవరణలో సోమవారం ఉదయం పది గంటలకు నిర్వహించే స్త్రీ శక్తి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ సరుబుజ్జిలి మండల మహిళా అధ్యక్షురాలు కొర్ను జగన్మోహిని కోరారు.

# పార్టీ కోసం కష్టపడే వారికి తగిన గుర్తింపు

* రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
* మంత్రిని కలిసిన కోటబొమ్మాళి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు, డైరెక్టర్లు





**కోటబొమ్మాళి/టెక్కలి, సెప్టెంబర్ 7 (వార్త):** పార్టీ కోసం కష్టపడేవారికి తగిన గుర్తింపు ఉంటుందని రాష్ట్రవ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. టెక్కలికి చెందిన సీనియర్ నాయకులు బగాది శేషగిరిరావును ఇటీవల ప్రభుత్వం కోటబొమ్మాళి మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ నేపథ్యంలో ఆదివారం నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో ఛైర్మన్, డైరెక్టర్లు, టెక్కలి మండలం తెలుగు దేశం పార్టీ నాయకులు మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. తమకు సముచిత స్థానం కల్పించి నందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు పనిచేసేవారికి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో టెక్కలి మండలం తెలుగు దేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు భరోసా**

పేద కుటుంబాలకు ముఖ్య మంత్రి సహాయనిధి ఎంతో భరోసాగా నిలుస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆరుగురు లబ్ధిదారులకు రూ.2,69,748 పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోని వచ్చినప్పటి నుంచి పేదలకు అన్ని విధాలా మేలు చేసేలా చేస్తున్నామని అన్నారు. వైద్య ఖర్చులతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ప్రజానీకానికి ముఖ్య మంత్రి సహాయ నిధి అపన్నహస్తంలా నిలుస్తోందని పేదవారికి సైతం మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో పెద్ద ఎత్తున ముఖ్య మంత్రి సహాయ నిధి చంద్రబాబు నాయుడు నిధులు విడుదల చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# అన్నదాత పోరుర్యాలీ విజయవంతం చేయాలి

**మందస, సెప్టెంబరు 7(వార్త):** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలువు మేరకు పలాసలో ఈ నెల 9న మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో ఉదయం పదిగంటలకు కాశీబుగ్గ వైఎస్సార్ స్వేర్ నుండి ప్రారంభం అయ్యే అన్నదాత పోరుర్యాలీని విజయవంతం చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు దల్లి జానకి రెడ్డి పిలుపునిచ్చారు. మందసలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అన్నదాత పోరుర్యాలీ, ఆర్డీఓకు వినతిపత్రం అందించే కార్యక్రమంలో మందస మండలం నుండి రైతులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్రంలో రైతు సమస్యలను పట్టించుకోని కూటమి ప్రభుత్వానికి కళ్లు తెరిపించాలనే ధ్యేయంతో సాగే ఈ అన్నదాత పోరులో రైతులతో పాటు అన్నీ వర్గాలు పాల్గొనాలని కోరారు. ఎరువులు సరఫరా చేయలేక, సరైన సమయంలో ఎరువులు వేయలేక రైతన్నలు పడుతున్న ఇబ్బందులు చూస్తే రైతులు పట్ల కూటమి ప్రభుత్వ వైఖరి అర్ధమౌతుందని, రైతులు పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న పాలకులకు నిరసనగా జరిగే అన్నదాతలు మందస మండలం నుండి అధిక సంఖ్యలో రైతులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు హాజరుకావాలన్నారు.



### అన్నదాత పోరుర్యాలీపై గ్రామాల్లో ప్రచారం

రైతులకు కూటమి ప్రభుత్వం అన్యాయం చేస్తోందని, దీంతోనే ఈ నెల 9న అన్నదాత పోరు ర్యాలీ నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన అధ్యక్షుడు శానాపతి కిషోర్ కుమార్ అన్నారు. మందస మండలంలోని కొంకడాపుట్టి, కుసుమల, బొగాబంద, హంసరాళి, చీపి, సాబకోట, కొండలోగాం, కుసుమల, టంగరపుట్టి తదితర గిరిజన గ్రామాల్లో ఆయన అనుచరులతో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో రైతు నాయకులు, రైతులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతూ ఎన్నడూలేని విధంగా ఎరువుల కొరత ఏర్పడిందన్నారు. ఖరీఫ్ సీజన్‌కు రైతులకు సరిపడే యూరియా అందివ్వడంలేదని ధ్వజమెత్తారు. రైతులకు ప్రభుత్వం మోసం చేసిందని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం హయాంలో ఇటువంటి సమస్య ఏర్పడలేదన్నారు. రైతు వ్యతిరేక ప్రభుత్వంగా కూటమి ప్రభుత్వం మారిందన్నారు. రైతులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతంగా మారాయన్నారు. ఈ నెల 9న పలాసలో జరిగే అన్నదాత పోరు ర్యాలీలో అన్ని వర్గాలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అన్నదాత పోరుర్యాలీ ఘన విజయం సాధిస్తే.. ప్రభుత్వం దిగి వస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గేదెల పద్మనాభం, సర్పంచ్ ప్రతినిధి రౌతు దుర్యోధన, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తమిరియా శోభన్‌బాబు, పినకాన తేజేశ్వరరావు, సవర రాము, సవర గోవిందు, కోదండ పాల్గొన్నారు.





## సమస్యలు పరిష్కారానికి పోరాటాలు అవసరం

**మందస, సెప్టెంబరు 7(వార్త):** సమస్యలు పరిష్కారం కోసం ఐక్యంగా కదలాలని సిఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు జె.హేమలత, పి.ఉమాలక్ష్మి పిలుపునిచ్చారు. అంగన్ వాడీ యూనియన్ ప్రాజెక్ట్ మహాసభ జె.హేమలత అధ్యక్షతన మందస పట్టణంలోని అన్నపూర్ణమ్మ గుడి ఆవరణలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్ వాడీలకు కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు, మినిట్ ప్రకారం రూ.26వేలు కనీస వేతనం గ్రాడ్యూటి అమలు, టీఏ, డీఏలు, మెనూ చార్జీలు పెంపు వంటి సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. సమస్యలు పరిష్కారానికి పోరాటానికి సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా జె.హేమలత, కార్యదర్శిగా పి.ఉమాలక్ష్మి, కమిటీ సభ్యులుగా టి.నాగేశ్వరి, సునీతాపండా, తులసి, ఎస్.జయమ్మ, స్వాతి, ఎం.కృష్ణవేణి, నాగమణి, జి.రమాదేవి, కె.హేమలత, ఎన్.పుణ్యావతి, పి.రాజేశ్వరి, ఎస్.పుణ్యావతి, ఆర్.త్రివేణి, ప్రతిమాసాహు, శ్యామలా కుమారి, కె.మాణిక్యం, డి.కృష్ణవేణి, పి.కోమలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## ఉపాధ్యాయుల సేవలు అమూల్యం

**మందస, సెప్టెంబరు 7(వార్త):** ఉపాధ్యాయుల సేవలు మరువలేనివని పలువురు వక్తలు అన్నారు. మందస మండలంలోని బిన్నళమదనాపురం ప్రాథమిక పాఠశాలలో సుమారు పదేళ్లపాటు ఉపాధ్యాయులుగా పనిచేసి వేరే ప్రాంతానికి బదిలీ అయిన టి.ఉమాపతి, ఎస్.ప్రేమ్ కుమార్‌లు, ఇక్కడకు బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు జి.దివ్య, అనుషాలకు విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పి.కొండలరావు, జి.రాజు, డి.ఈశ్వరరావు, డి.గణేష్, సంతోష్, బొడ్డ ధనుంజయుడు, మార్పు మాధవరావు, మార్పు మన్మధరావు, మార్పు మధుసూదనరావు, దున్న సింహాచలం, ప్రత్యేక అతిథి మార్పు భవానికృష్ణమూర్తి, మార్పు సౌమ్య తదితరులు పాల్గొన్నారు. తెలుగు ఉపాధ్యాయుడు మార్పు జగన్మో హనరావు అందరికీ మంచి తేనేటి విందు ఏర్పాటు చేశారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## ఆకట్టుకున్న అక్షరాస్యత లోగో

**సారవకోట/జలుమూరు, సెప్టెంబర్ 7(వార్త):** అవలింగి జేబిటి కాన్వెంట్ ఆవరణలో ముందస్తుగా ఆదివారం అక్షరాస్యత దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు అక్షరాస్యత లోగో రూపంలో కూర్చొని ప్రదర్శన ఇచ్చారు. అక్షరాస్యత ఆవశ్యకతను పాఠశాల వ్యవస్థాపకులు మోహన్ గాంధీ వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



# ఉపాధ్యాయులను ప్రతి ఒక్కరూ గౌరవించాలి

**ఎల్ఎన్‌పేట, సెప్టెంబర్7(వార్త):** ఉపాధ్యాయులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత లయన్.డా.ఎం.కె.మిశ్రో అన్నారు. లక్ష్మీ నర్సు పేట గ్రామంలో మోడల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.రమాదేవి, ఉపాధ్యాయులు ఎన్.రామారావు, పి.లక్ష్మణరావు, టి.ఉపేంద్ర, మిశ్రో మాస్టారును సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ భవానీ శంకర్ పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం గూర్చి చక్కగా మాట్లాడిన లంక మోక్షితకి బహుమతిని ప్రదానం చేశారు.




## మిశ్రో మాస్టారుకు సన్మానం

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ మెంటార్ ఎన్.మోహన్,



వయోజన విద్య ఛైర్మన్ డా.బి.దేవభూషణ్, ఉపాధ్యక్షులు ఉమామహేశ్వరరావు, సెక్రటరీ టి.రామగోపాల్, సభ్యులు పి.చరణ్, డా.శ్రావ్య, సభ్యులు వరలక్ష్మీ, ఇతర సభ్యులు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత లయన్.డా.ఎం.కె.మిశ్రోను సన్మానించారు.

## ఉపాధ్యాయులకు సన్మానం

బొత్తాడసింగి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు పి.శ్రీనివాసరావు, ఆర్.కృష్ణారావులను బొత్తాడసింగి గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నేతలు అంపిలి పోలినాయుడు, తోనంగి వెంకటరావు, లంక బుజ్జికృష్ణ, లోతుగడ్డ శ్రీనివాసరావు, లంక లక్ష్మీనారాయణ, వాడాడ రాము, బుర్రాల రాంబాబు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



## డైరెక్టర్ పదవి పట్ల అభినందన

**ఇచ్ఛాపురం, సెప్టెంబర్ 7 (వార్త):** కూటమి ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన 11 కార్పొరేషన్ డైరెక్టర్లలో ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ దక్కత కామేశ్వర రావుకి పదవి లభించింది. ఈ సందర్భంగా ఆదివారం రామయ్యపుట్టుగలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బెందాళం అశోక్ బాబు దక్కత కామేశ్వరరావుకు సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు మాజీ ఎంపీపీ దక్కత డిల్లీరావు, పద్మనాభం, సూర్యనారాయణ, ఐటీడీపీ మండల అధ్యక్షుడు నరేంద్ర రెడ్డి, యువరాజ్, లోహి, గోపి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైసీపీ రాష్ట్ర కార్యదర్శిగా శ్యాం ప్రసాద్ రెడ్డి

**ఇచ్ఛాపురం, సెప్టెంబర్ 7 (వార్త):** వైస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శిగా సాడి శ్యాం ప్రసాద్ రెడ్డిని నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుండి ఉత్తర్వులు వెలువడ్డాయి. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో టెక్కలి, నరసన్నపేట అసెంబ్లీ నియోజక వర్గాల పరిశీలకులుగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డికి శ్యాం ప్రసాద్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.



## రామానంద భారతి స్వామిని కలిసిన ఎమ్మెల్యే శంకర్

**శ్రీకాకుళం, సెప్టెంబర్ 7 (వార్త):** విశాఖపట్నం శ్రీ సౌభాగ్య భువనేశ్వరి పీఠం పీఠాధిపతులు రామానంద భారతి స్వామిని ఎమ్మెల్యే గొండు శంకర్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. చాతుర్మాస దీక్షలో భాగంగా స్వామీజీ గత మూడు రోజులుగా అరసవల్లిలో పూజలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా స్వామిని ఎమ్మెల్యే కలుసుకొని దీక్షకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్వామి మాట్లాడుతూ హైందవ ధర్మ పరిరక్షణలో ఆలయాలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అరసవెల్లి ఆదిత్యుని విశిష్టత పెంచే విధంగా రథసప్తమిని రాష్ట్ర పండుగగా ప్రాధాన్యత కల్పించడంలో ఎమ్మెల్యే శంకర్ చేసిన కృషిని అభినందనీయమన్నారు. అలాగే శ్రీ కూర్మనాధుని ఆలయాన్ని కూడా మరింత అభివృద్ధి చేయాలని స్వామి ఆకాంక్షించారు.

## నారీశక్తిపై అవగాహన



**ఇచ్ఛాపురం, సెప్టెంబర్ 7 (వార్త):** నారీ శక్తిపై కొఠారిలో మహిళలకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, మహిళా రక్షణ, బాల్య వివాహాలు,గుడ్ టచ్ బాడ్ టచ్ గురించి వివరించారు. 112, 1098, 1930 టోల్ ఫ్రీ నెంబర్లపై రూరల్ ఎస్ఐ ఈ శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. అనంతరం మహిళలతో ర్యాలీ నిర్వహించారు.

## స్వచ్ఛాంధ్ర అవార్డుకు జలుమూరు ప్రాథమిక పాఠశాల

**జలుమూరు, సెప్టెంబర్ 7(వార్త):** స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో జిల్లా అధికారులు పరిశుభ్రతపై పోటీలు నిర్వహించారు. ఈ క్రమంలో పది పాఠశాలలను ఎంపిక చేయగా 95 మార్కులతో జలుమూరు ప్రాథమిక పాఠశాలను స్వచ్ఛాంధ్ర అవార్డు-2025కి ఎంపికైంది. ఈ క్రమంలో ఆదివారం పాఠశాల హెచ్ఎం మాధవరావు, ఉపాధ్యాయుడు మెండ రామారావు, ఉపాధ్యాయులను ఎంఈఓలు బమ్మిడి మాధవరావు, వరప్రసాదరావు అభినందించారు.

## టిడ్కో ఇళ్ల పరిశీలన

**ఆమదాలవలస, సెప్టెంబర్ 7 (వార్త):** జగ్గు శాస్త్రుల పేటలోని టిడ్కో ఇళ్లను రాష్ట్ర పీయూసీ ఛైర్మన్, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆదివారం సందర్శించారు. ఇళ్ల సముదాయాలను సంబంధిత అధికారులు, నేతలతో కలిసి పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని, మౌలిక సదుపాయాలను కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు త్వరలో అందజేయాలన్నారు.



## చేసిన సేవలతోనే గుర్తింపు

**పలాస,సెప్టెంబర్7(వార్త):** ప్రభుత్వ ఉద్యోగులకు చేసిన సేవలతోనే గుర్తింపు వస్తుందని పలాస-కాశీబుగ్గ మున్సిపల్ ఛైర్మన్ బళ్ల గిరిబాబు అన్నారు. పెదంచల గ్రామానికి చెందిన తలగాన లింగరాజు పోలాకి మండల విద్యాశాఖాధికారిగా పనిచేసి పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా పోలాకి మండలంలో పదవీ విరమణ చేసిన లింగరాజు మాస్టర్ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ సమాజానికి భావి పౌరులను అందించిన లింగరాజు మాస్టర్‌ను పోలాకి జడ్పీటిసి డాక్టర్ కృష్ణచైతన్య, డీసీసీబీ మాజీ ఛైర్మన్ కరిమి రాజేశ్వరరావులతో కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో నరసన్నపేట ఎంపీపీ మురళి పాల్గొన్నారు.

## నేత్రదానంపై అవగాహన

**కొత్తూరు, సెప్టెంబర్7 (వార్త):** జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు సందర్భంగా కొత్తూరు మండలంలోని వసప కేజీబివి పాఠశాలలో విద్యార్థుల కోసం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. నేత్రదానం ప్రాముఖ్యతను విద్యార్థుల్లో చైతన్యం కల్పించడం లక్ష్యంగా ఈ పోటీలు విజయవంతంగా జరిగాయి. అప్తాలమిక్ అధికారి ఇప్పిలి జానకి రామయ్య ఈ కార్యక్రమాలను ప్రారంభించి మాట్లాడుతూ నేత్రదానం చేయడం వల్ల కాంతి కోల్పోయిన వారికి ఆశాజ్యోతి ప్రసాదమవుతుందని వివరించారు. పాఠశాల సామాన్యశాస్త్రం ఉపాధ్యాయురాలు ఐ.కీర్తన ఆధ్వర్యంలో పోటీలు సజావుగా సాగాయి. ఈ పోటీల్లో జే.చరణ ప్రథమ స్థానం, పి.పవిత్ర ద్వితీయ స్థానం, జె.లత తృతీయ స్థానం సాధించారు. విజేతలకు బహుమతులను పాఠశాల ఉపాధ్యా యులు అందజేశారు.

## ఆరోగ్యశ్రీని బీమా పరిధిలో తేవడం సరికాదు

**కొత్తూరు, సెప్టెంబర్7 (వార్త):** వైద్య కళాశాలల ప్రైవేటీకరణ, ఆరోగ్యశ్రీని బీమా పరిధిలోకి తీసుకురావడం సరికాదని వైసీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. బలహీన వర్గాలకు వైద్యవిద్య, ఉచిత చికిత్సలు దూరం చేసేలా ఉన్నాయని తెలిపారు. గ్రేట్ విజనరీ అని చెప్పుకున్న చంద్రబాబు ఇన్నేళ్ల పాలనలో రాష్ట్రంలో ఒక్క మెడికల్ కాలేజీని కూడా ఏర్పాటు చేయలేదన్నారు. వైయస్ జగన్ తెచ్చిన కాలేజీలను ప్రైవేటుకి చంద్రబాబు అమ్మేస్తున్నారని విమర్శించారు. ఆరోగ్యశ్రీలో ఇన్సూరెన్స్ విధానం ప్రభుత్వ కుట్ర అని, తన వారికి లబ్ధి చేకూర్చేందుకే కుట్ర పన్నుతున్నారన్నారు. అలాగే కూటమి ప్రభుత్వం కార్పొరేట్ విద్యకు అందలం ఎక్కించి, ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తోందన్నారు. రైతులకు కనీసం ఎరువులు అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. యూరియా, ఎరువులు దొరక్క రాష్ట్ర వ్యాప్తంగా క్యూ లైన్లలో అన్నదాతలు అల్లాడుతున్నారని తెలిపారు. ఈనెల 9న రైతులతో కలిసి పోరుబాట కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఆందోళనలో రైతులు, పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

## విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

**జి.సిగడాం, సెప్టెంబర్ 7 (వార్త):** జి.సిగడాం మండలం జాడ గ్రామంలో ముక్కుపేట గ్రామానికి చెందిన తాలాడ వెంకటరావు విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. ఆదివారం ఓ రైతుకు సంబంధించి పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కోసం విద్యుత్ స్తంభం ఎక్కాడు. ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మధుసూదన రావు తెలిపారు.

## సెల్‌ఫోన్ దొంగ అరెస్టు

**పలాస, సెప్టెంబర్7(వార్త):** సెల్‌ఫోన్ దొంగ బింగి జగదీశ్వరరెడ్డిని రైల్వే పోలీసులు పట్టుకుని, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పలాస రైల్వే స్టేషన్‌లో పోలీసులు తనిఖీ చేస్తున్న సమయంలో అనుమానాస్పదంగా కనిపించిన ఒడిశాలోని నారాయణపూర్‌కు చెందిన బింగి జగదీశ్వర్ రెడ్డిని పట్టుకున్నారు. పలు రైళ్లలో దొంగతనాలు చేసేవాడని పోలీసులు తెలిపారు. అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించామని పలాస జీఆర్పీ ఎస్ఐ కోటేశ్వరరావు పేర్కొన్నారు.

## సచివాలయం ఉద్యోగుల ఆత్మాభిమానం కాపాడాలి



**ఇచ్ఛాపురం, సెప్టెంబర్7(వార్త):** సచివాలయం ఉద్యోగుల ఆత్మాభిమానం కాపాడాలని వార్డ్ సచివాలయం ఉద్యోగుల సంఘం కోరింది. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేశ్‌కి వినతిపత్రం అందజేశారు. గతంలో వలంటీర్లు చేసే విధులన్నీ తమతో చేయిస్తున్నారన్నారు. ఉన్నత చదువులు చదివి కార్యాలయంలో పని చేస్తున్న ఉద్యోగులను వలంటీర్ విధులకు వాడుకోవడం తగదన్నారు.

## పేదలకు సేవలు అందించండి

**జలుమూరు, సెప్టెంబరు7 (వార్త):** పేదలకు ప్రభుత్వం సమకూరుస్తున్న వైద్య సేవలను, ప్రభుత్వ వైద్యులు సిబ్బంది సక్రమంగా అందించాలని ట్రైనీ కలెక్టర్ డి.పృధ్వీరాజ్ కుమార్ వెల్లడించారు. శనివారం జలుమూరు మండలంలోని జలుమూరు, సైరిగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి భవనాలను, ప్రభుత్వం పేదలకు అందించేందుకు అందిస్తున్న, వైద్య పరికరాలను మాత్రలను ఆయన పరిశీలించారు. రోగులకి అందించే సేవలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వ అసుపత్రిలో పూర్తి సేవలు అందించే ఏర్పాటు చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. కుటుంబ సంక్షేమ చికిత్సలు, ఆసుపత్రి ప్రసవాలు అధికంగా నిర్వహించే విధంగా వైద్యాధికారులు, సిబ్బంది కృషి చేయాలని ఆయన ఆదేశించారు. అసుపత్రి ప్రసవాలు అధికంగా చేపట్టాలన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546